నేటి కందం- నేటికి అందం



విఘ్నేశుని పూజింపగ
విఘ్నమ్ములు తొలగిపోయి విధులన్నియు-ని
ర్విఘ్నమ్ముగ జరుగగలవు
విఘ్నేశుడు మన కొసగుత వేల శుభములన్ !!

(వినాయక చవితి శుభాకాంక్షలతో)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

చురక

స్పీకర్లే చట్టసభల్లో
సమదృష్టికి ఆద్యులు
నిష్పాక్షిక రాజకీయ
నిర్వాహన బాధ్యులు
అంతా మంచే విధులన్ని
అమలు పరిచినప్పుడు
అందుకొరకే విపక్షాల
ఆందోళన పెను చప్పుడు

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ బుధవారం 27-8-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :32 సంచిక:21 పేజీలు:6 వెల: రూ.1/-



పాఠకులకు, ప్రకటన కర్తలకు
వినాయక చవితి
శుభాకాంక్షలు

## స్థానిక సంస్థల ఎన్నికల వేళ.. నోటిఫికేషన్ విడుదల చేసిన ఎన్నికల కమిషన్

హైదరాబాద్, ఆగష్టు 26:తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం తన కసరత్తును రాష్ట్ర ఎన్నికల సంఘం ముమ్మరం చేసింది. అందులో భాగంగా మంగళవారం గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాలు, తుది ఓటర్ల జాబితా విడుదలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ క్రమంలో నోటిఫై చేయబడిన అన్ని గ్రామ పంచాయతీల్లోని ఫోటో ఓటర్ల జాబితాను తయారు చేసి ప్రచురించాలని పంచాయతీ అధికారులను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితా తయారీ ప్రచురణ కోసం షెడ్యూల్ సైతం విడుదల చేసింది.

అయితే ఆగష్టు 28వ తేదీ లోపు గ్రామ పంచాయతీల ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ చేసి గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను ప్రదర్శించాలని జారీ చేసిన నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. ఇక ఆ మరునాడే.. అంటే ఆగష్టు 29వ తేదీన ఎంపీడీవోల ద్వారా మండల స్థాయిలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారు. ఆగష్టు 30వ తేదీన ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరిస్తామని ఎన్నికల సంఘం వెల్లడించింది. అలాగే ఆగష్టు 31వ తేదీన జిల్లా పంచాయతీ అధికారి గ్రామ పంచాయతీల వార్డుల వారీగా ఫోటో ఓటర్ల తుది జాబితాలను ప్రచురణ చేస్తారని ఎన్నికల సంఘం తెలిపింది.

ఈ ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. గడువు ముగిసిన స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదంటూ పలువురు తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లను విచారించిన హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 30వ తేదీలోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది.

2024, జనవరి 31వ తేదీతో సర్పంచుల పదవీ కాలం ముగిసింది. దీంతో ఏడాదిన్నరగా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడం లేదంటూ పలువురు కోర్టును ఆశ్రయించారు. దీంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువరించింది.

మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన బిల్.. తెలంగాణ అసెంబ్లీలో ఆమోదం పొందింది. అనంతరం కేంద్రానికి పంపింది. దీనిపై కేంద్రం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ నేపథ్యంలో ఈ బిల్లును అమోదించాలంటూ తెలంగాణలోని అధికార కాంగ్రెస్ పార్టీతోపాటు ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలు దేశ రాజధాని న్యూఢిల్లీ వేదికగా ఆందోళనలు చేపట్టిన విషయం విదితమే. ఇంకోవైపు ఈ బిల్లు ఆమోదం కోసం అధికార పార్టీ కాంగ్రెస్ పార్టీతోపాటు బీజేపీ,బీఆర్ఎస్ పార్టీలు ఒకదానిపై ఒకటి విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటున్నాయి.

## ఈ నెల 30 నుంచి అసెంబ్లీ సమావేశాలు..

హైదరాబాద్, ఆగష్టు 26: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఆగష్టు 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. అంతకు ముందు రోజు అంటే 29వ తేదీన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారు. ఈ కేబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అసెంబ్లీ సమావేశాల్లో కాళేశ్వరం కమిషన్ నివేదికపై చర్చించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశాల్లోనే సభ్యులందరికీ కమిషన్ రిపోర్ట్‌ను ప్రభుత్వం అందించనుంది. కాగా, అసెంబ్లీ సమావేశాలు 5 రోజుల పాటు నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## మానవాళి మనుగడకు చెట్లే జీవనాధారం : మధిర సీఐ మధు



ఖమ్మం, ఆగష్టు 26: ప్రపంచ మానవాళి మనుగడకు చెట్లే జీవనాధారమని మధిర సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.మధు అన్నారు. బోనకల్లు మండలంలోని ముష్టికుంట్ల పురమ్మ తల్లి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సంగాపు దుర్గాప్రసాద్ సహకారంతో రూ.25 వేల వ్యయంతో 50 పనస మొక్కలను నాటే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ హాజరై స్థానిక ఎస్ఐ పొదిలి వెంకన్నతో కలిసి పనస మొక్కలను నాటారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రజలందరీ బాధ్యత అన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, రేపటి తరాలకు అందించాలన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న సంగాపు దుర్గాప్రసాద్‌ను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అనంతరం స్వాతంత్ర సమరయోధులు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సంగాపు తిరుపతయ్య, సంగాపు వెంకటనారాయణల జ్ఞాపకార్థం సంగాపు దుర్గాప్రసాద్ రూ.50 వేల వ్యయంతో 25 బల్లలను గ్రామంలోని ప్రధాన కూడళ్లలో వితరణగా అందజేశారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షేక్ సైదులు, చిట్టంశెట్టి రాము, సంగాపు శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు బంధం శ్రీనివాసరావు, కందికొండ శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నాయకులు చల్లి ప్రసాదరావు, సిపిఐ నాయకుడు బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

## దారుణం.. ప్రియుడితో కలిసి భార్య ఏం చేసిందంటే..

నిర్మల్, ఆగష్టు 26: ఇటీవల కాలంలో తరచుగా భర్తలను భార్యలు, భార్యలను భర్తలు చంపడం కలకలం సృష్టిస్తోంది. కుటుంబకలహాలు, వివాహేతర సంబంధాలు, ఆర్థిక సమస్యలు వంటివి భాగస్వాముల ప్రాణాలను తీస్తున్నాయి. ముఖ్యంగా వివాహేతర సంబంధాలు కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. పెళ్లయిన పిల్లలు ఉన్నా.. ఇతరులపై వ్యామోహంతో కట్టుకున్న వారినే కడతేరుస్తున్నారు. ఈ క్రమంలో కడుపున పుట్టిన అభంశుభం తెలియని పిల్లలను రోడ్డుపైకి తెస్తున్నారు. భర్తను భార్య చంపడమో, భార్యను భర్త చంపడమో చేస్తూ జైలు పాలవుతున్నారు. తాజాగా అలాంటి ఘటనే నిర్మల్ జిల్లాలో చోటు చేసుకుంది.

నిర్మల్ జిల్లా సోన్ మండలం వెల్మల్ గ్రామంలో ఓ భార్య దాష్టీకానికి భర్త బలయ్యాడు.

భార్య నాగలక్ష్మి ప్రియుడు మహేష్‌తో కలిసి భర్త హరిచరణ్‌ను హత్య చేసింది. నాగలక్ష్మి అదే గ్రామానికి చెందిన మహేష్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. భర్తకు తెలియడంతో 5 రోజుల క్రితం టవల్‌తో గొంతు నులిమి హతమార్చింది. అనంతరం హరిచరణ్ మూర్ఛ వచ్చి చనిపోయాడని బంధువులను, గ్రామస్తులను నమ్మించింది. తల్లిపై అనుమానంతో కుమారుడు కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు నిజానిజాలను రాబట్టి నాగలక్ష్మిని ఆమె ప్రియుడు మహేష్‌ను అరెస్ట్ చేశారు.

## మహీంద్రా యూనివర్సిటీలో 50 మంది విద్యార్థులకు డ్రగ్స్ పాజిటివ్

హైదరాబాద్, ఆగష్టు 26: హైదరాబాద్‌లోని మహీంద్రా యూనివర్సిటీలో డ్రగ్స్ కలకలం సృష్టించాయి. 50 మంది విద్యార్థులకు డ్రగ్స్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. మల్నాడు రెస్టారెంట్ యజమాని ఇచ్చిన సమాచారంతో సోదాలు నిర్వహించిన పోలీసులు.. కిలోన్నర గంజాయి, 47 గ్రాముల ఓజీ వీడ్ స్వాధీనం చేసుకున్నారు.

మల్నాడు రెస్టారెంట్ యజమాని ఇచ్చిన సమాచారంతో మహీంద్రా యూనివర్సిటీలో మంగళవారం నాడు పోలీసులు సోదాలు నిర్వహించారు. శ్రీమారుతి కొరియర్ ద్వారా ఢిల్లీ నుంచి డ్రగ్స్ సరఫరా అవుతున్నట్లు గుర్తించారు. గతంలో నైజీరియన్ నిక్ నుంచి ఎండీఎంఏ కొనుగోలు చేసి.. పలు పబ్‌ల్లో విద్యార్థులు పార్టీలు చేసుకున్నట్లుగా గుర్తించారు. ఈ నేపథ్యంలో డ్రగ్స్ పాజిటివ్ వచ్చిన విద్యార్థులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఇదిలా ఉంటే హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో సోమవారం డ్రగ్స్ పార్టీ జరుగుతుందన్న సమాచారంతో ఈగల్ టీం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. డ్రగ్స్ పార్టీలో పాల్గొన్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వీళ్లలో మల్నాడు డ్రగ్స్ కేసులో నిందితుడుగా ఉన్న విక్రమ్ కూడా ఉన్నట్లు గుర్తించారు. నిందితుల్లో రాజమండ్రి డిప్యూటీ తహశీల్దార్ మణిదీప్ కూడా ఉండటం గమనార్హం. వీరి నుంచి 20 గ్రాముల కొకైన్, 4 గ్రాముల ఎండీఎంఏ, 20 ఎక్స్‌టీసీ పిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో వీరు బెంగళూరు నుంచి డ్రగ్స్ తీసుకొచ్చినట్లుగా తెలిసింది.

## హిమాచల్ ప్రదేశ్‌లో తీవ్ర స్థాయి వర్షాలు విరిగిపడ్డ కొండచరియలు

-భారీ వరదల వల్ల దెబ్బతిన్న కిరాట్పూర్-మనాలీ జాతీయ హైవే

-మండీ, మనాలీ లో పూర్తిగా స్తంభించిపోయిన ట్రాఫిక్

మనాలీ ఆగష్టు 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: హిమాచల్ ప్రదేశ్‌పై మళ్లీ ప్రకృతి తన ప్రకోపాన్ని చూపించింది. తీవ్ర స్థాయి వర్షాల వల్ల కొండచరియలు విరిగిపడ్డాయి. భారీ వరదల వల్ల కిరాట్పూర్-మనాలీ జాతీయ హైవేపై నష్టం జరిగింది. దీంతో మండీ, మనాలీ లో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల .. బియాస్ నది ఉప్పొంగుతున్నది. దాని ఉప నదులు కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో ఎమర్జెన్సీ చర్యలు చేపడుతున్నారు. జాతీయ రహదారి పలు ప్రదేశాల్లో బ్లాక్ అయ్యింది.మనాలీ సమీపంలో ఉన్న బిందు ధంక్ వద్ద బియాస్ నది వరద నీటికి జాతీయ హైవే కొట్టుకుపోయింది. దీంతో పాపులర్ టూరిస్టు కేంద్రానికి రాకపోకలు తెగిపోయాయి. మనాలీలో నది సమీపంలో ఉన్న ఓ హోటల్.. ఆ వరదలో కొట్టుకుపోయింది. మండి, కుల్లు ప్రాంతాల్లో డేంజర్ మార్క్ దాటి నది ప్రవాహిస్తున్నది. లోతట్టు ప్రాంతాల్లో జీవిస్తున్న వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నది. బహంగ్, అలూ గ్రౌండ్ ప్రాంతాల నుంచి జనాలను తరలిస్తున్నారు. మరో 24 గంటల పాటు నది సమీపానికి వెళ్లవద్దు అని టూరిస్టులకు అధికారులు వార్నింగ్ ఇచ్చారు.

## యూరియా పంపిణీపై రేపు అన్ని జిల్లా కలెక్టర్లతో సమీక్ష:మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్ ఆగష్టు 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: యూరియా కోసం రైతులు క్యూలో ఉండాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. యూరియా పంపిణీపై రేపు అన్ని జిల్లాల్లో సమీక్షిస్తామని అన్నారు. జూపల్లి మీడియాతో మాట్లాడుతూ..ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. కేంద్రప్రభుత్వం పంపిన యూరియానే రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తోందని, నానో యూరియా వాడాలని కేంద్రం చెప్తోందని తెలియజేశారు. నానో యూరియా వాడకంపై ప్రజల్లో ఇంకా అవగాహన పెరగలేదని, యూరియా కొరత ఉందని కేంద్రప్రభుత్వమే చెప్తోందని అన్నారు. అంతర్జాతీయ యుద్ధాల వల్ల దిగుమతి సమస్య ఉందని కేంద్రం చెప్తోందని, యూరియా కేటాయింపులో కేంద్రం సహకరించటం లేదని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

హైదరాబాద్ ఆగష్టు 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: యూరియా కోసం రైతులు క్యూలో ఉండాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. యూరియా పంపిణీపై రేపు అన్ని జిల్లాల్లో సమీక్షిస్తామని అన్నారు. జూపల్లి మీడియాతో మాట్లాడుతూ..ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. కేంద్రప్రభుత్వం పంపిన యూరియానే రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తోందని, నానో యూరియా వాడాలని కేంద్రం చెప్తోందని తెలియజేశారు. నానో యూరియా వాడకంపై ప్రజల్లో ఇంకా అవగాహన పెరగలేదని, యూరియా కొరత ఉందని కేంద్రప్రభుత్వమే చెప్తోందని అన్నారు. అంతర్జాతీయ యుద్ధాల వల్ల దిగుమతి సమస్య ఉందని కేంద్రం చెప్తోందని, యూరియా కేటాయింపులో కేంద్రం సహకరించటం లేదని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

## ఈ నెల 30 నుంచి అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్ ఆగష్టు 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 30 నుంచి జరుగనున్నాయి. మూడు లేదా ఐదు రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నది. మొదటి రోజు జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతికి అసెంబ్లీ సంతాపం ప్రకటించనుంది. ఈ సమావేశాల్లో ఉపసభాపతి ఎంపిక జరుపనున్నారు. కాళేశ్వరంపై సీపీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదిక గురించి చర్చించనున్నట్లు తెలుస్తున్నది. ప్రత్యేక సమావేశానికి సంబంధించి ఈ నెల 29న కేబినెట్ భేటీలో ఎజెండా ఖరారు కానుంది.

## ఇసుక మాఫియాపై ఉక్కుపాదం : సీఐ శంకర్

రాజాపేట, ఆగస్టు 26 : ఇందిరమ్మ ఇండ్ల పేరుతో పర్మిషన్ తీసుకుని చాటు ప్రదేశాల్లో డంప్ చేసి లారీల్లో అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపనున్నట్లు యాదగిరిగుట్ట రూరల్ సీఐ ఎం.శంకర్ హెచ్చరించారు. మంగళవారం రాజపేట పోలీస్ స్టేషన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. ఇసుక మాఫియాను అరికట్టేందుకు గతంలో కేసులు నమోదు చేసి రౌడీషీటర్ ఓపెన్ చేసినట్టు తెలిపారు. అయినా పట్టింపు లేకుండా అలాగే దందా కొనసాగిస్తామంటే ఊరుకునేది లేదన్నారు. అక్రమ సంపాదనకు పోయి కుటుంబాన్ని రోడ్డు మీద నిలబెట్టుకోకూడదని హితవు పలికారు.

గణేష్ మండప నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు మండలంలో చాలా తక్కువగా దరఖాస్తులు వచ్చాయని, ప్రతి ఒక్కరు నమోదు చేసుకోవాల్సిందేనని తెలిపారు. అధికారులు సూచించిన చెరువుల్లోనే నిమజ్జనం చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా, వాగ్వాదాలు, వివాదాలకు వెళ్లకుండా శాంతియుతంగా నవరాత్రులు జరుపుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## భారతీయ ఎగుమతులపై 50 శాతం సుంకాలు బుధవారం నుంచి అమల్లోకి..



వాషింగ్టన్ ఆగష్టు 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: భారతీయ ఎగుమతులపై 50 శాతం సుంకాలు బుధవారం (ఆగష్టు 27) నుంచి అమల్లోకి రానున్నాయి. ఇప్పటికే 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్ సర్కార్.. రష్యా చమురు కొనుగోళ్లను సాకుగా చూపి భారత్‌పై మరో 25 శాతం టారీఫ్‌లు విధించిన విషయం తెలిసిందే.

ఆగష్టు 6న ఈ ఎగ్జిటీవ్ ఆర్డర్‌పై 14329పై సంతకం చేసిన ట్రంప్.. ఈ నెల 27 నుంచి 50 శాతం టారీఫ్‌లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. దీంతో తాజాగా 25 అదనపు సుంకాలపై అమెరికా అధికారికంగా బహిరంగ నోటీసులు జారీ చేసింది. భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై కొత్త సుంకాలు ఆగష్టు 27 తెల్లవారుజాము 12.01 గంటల నుంచే అమల్లోకి వస్తాయని యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ ద్వారా హోమ్‌లాండ్ ఆఫ్ సెక్యూరిటీ విడుదల చేసిన నోటీసుల్లో పేర్కొంది.

## నేను ఆ కార్డులను ఉపయోగిస్తే.. చైనా నాశనం అవుతుంది: ట్రంప్

న్యూయార్క్‌ఆగష్టు 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఈ సంవత్సరం చివరలో తాను చైనా పర్యటనకు వెళ్తానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. చైనా, అమెరికా మధ్య అద్భుతమైన సంబంధాలు ఉంటాయని చెప్పుకొచ్చారు. బీజింగ్‌తో తాము సంబంధాలు కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నామని, కానీ చైనా కంటే తమ ఆధిపత్యమే ఎక్కువ అని హెచ్చరించారు. వాణిజ్య విభేదాల్లో బీజింగ్ కంటే వాషింగ్టన్ బలంగా ఉందని తెలియజేశారు. చైనా వద్ద కొన్ని కార్డులు ఉన్నాయని, వాళ్ల కంటే తమ వద్ద అద్భుతమైన కార్డులు ఉన్నాయని పేర్కొన్నారు. ఆ కార్డులతో తాము ఆట ఆడుకోవాలని లేదని, తాము ఒకవేళ ఆడితే చైనా నాశనం అవుతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆటోమొబైల్, రక్షణ రంగానికి కావాల్సిన మ్యాగ్నెట్స్‌ను చైనా తమకు దిగుమతి చేయాల్సిం దేనని స్పష్టం చేశారు. చైనా వాళ్లు మ్యాగ్నెట్స్‌ను దిగుమతి చేయకుంటే టారిఫ్‌లను 200 శాతం పెంచుతా మని ట్రంప్ వివరించారు. అందుకే ఆ కార్డులతో ఆడటం లేదని చెప్పారు.అమెరికా టెక్ కంపెనీలపై పలు దేశాలు విధిస్తున్న డిజిటల్ పన్నులపై ట్రంప్ మండిపడ్డారు. మా టెక్ కంపెనీలపై పన్నుల రూపంలో జరుగుతున్న దాడులకు ఎదురునిల బడుతానని చెప్పారు. డిజిటల్ పన్నులు, డిజిటల్ సర్వీసెస్ చట్టాలు, డిజిటల్ మార్కెట్ రెగ్యులేషన్స్ లాంటి అమెరికా టెక్నాలజీకి హాని కలిగిస్తున్నాయని, చైనా కంపెనీలపై ఎలాంటి పన్నులు వేయడంలేదని మండిపడ్డారు. ఇవన్నీ ఆగాలంటే ఆయా దేశాలపై అదనపు టారిఫ్‌లు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. మా టెక్ కంపెనీలను గౌరవించకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు.

## జిల్లా పోక్సో కోర్టు సంచలన తీర్పు..

నల్గొండ, ఆగషు 26: జిల్లా పోక్సో కోర్టు సంచలన తీర్పునిచ్చింది. పోక్సో కేసులో తిప్పర్తికి చెందిన మహమ్మద్ ఖయ్యూంను దోషిగా తేల్చింది న్యాయస్థానం.

నిందితుడికి 51 ఏళ్ల శిక్ష విధిస్తూ న్యాయమూర్తి రోజారమణి తీర్పు వెల్లడించారు. అత్యాచారం కేసులో 20 ఏళ్లు, పోక్సో కేసులో 20 ఏళ్లు, ఎస్సీ ఎస్టీ కేసులో పదేళ్లు, సెక్షన్ 506(మైనర్ బాలికపై బెదిరింపులు) కేసులో మరో ఏడాది శిక్ష విధిస్తూ న్యాయమూర్తి సంచలన తీర్పునిచ్చారు.

నిందితుడు ఖయ్యూం 2021లో తిప్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో దళిత మైనర్ బాలికపై అత్యాచారం చేశాడు.

ఆపై విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితురాలు కుటుంబ సభ్యుల సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు ఖయ్యూంపై రేప్ కేసు నమోదు చేశారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ నేతృత్వంలో న్యాయస్థానానికి సరైన సైంటిఫిక్ ఎవిడెన్స్ సమర్పించడంతో నిందితుడు శిక్ష నుంచి తప్పించుకోలేకపోయాడు.

## తెలంగాణలో ఐదురోజులు వానలే..

## రెండు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ..!



హైదరాబాద్, ఆగష్టు 26:తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఒడిశా తీరాన్ని ఆనుకొని వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని వెల్లడించింది. తుఫాను ప్రసరణ సముద్రమట్టానికి సగటున 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని.. ఎత్తుకు వెళ్లేకొద్దీ నైరుతి వైపునకు వంగి ఉందని.. పశ్చిమ వాయువ్య దిశగా కదిలి రాబోయే రెండురోజుల్లో మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంది. ఈ క్రమంలో మంగళవారం భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. కొత్తగూడెం, హన్మకొండ, జనగాం, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, ఆసిఫాబాద్, మంచిర్యాల, నల్గొండ, పెద్దపల్లి, సూర్యాపేట, వరంగల్, భువనగిరి, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.

బుధవారం కొత్తగూడెం, భూపాలపల్లి, ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని అంచనా వేసింది. గురువారం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని.. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. శుక్రవారం ఆదిలాబాద్, కొత్తగూడెం, హన్మకొండ, హైదరాబాద్, జగిత్యాల, జనగాం, భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, ములుగు, నల్గొండ, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్, భువనగిరి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. శనివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, కామారెడ్డి, ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే సూచనలున్నాయని చెప్పింది.

# వినాయక చవితి విశిష్టత మహోన్నతం !

## (27 ఆగస్టు “వినాయక చవితి” పర్వదినం సందర్భంగా)

విఘ్నాలను హరిస్తూ, విజ్ఞాన వివేకాల అందిస్తూ, సంపదలను ప్రసాదిస్తూ లోక కల్యాణం కాంక్షించే వినాయకుడి జన్మదినోత్సవమే “వినాయక చవితి” లేదా “గణేశ చతుర్థి”గా జరుపుకుంటాం. దేశవ్యాప్తంగా 27 ఆగస్టు 2025 రోజున పుణ్య గడియల్లో గణేశ చతుర్థి పండుగను పది రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించుకుంటాం. వయోభేదం లేకుండా పసి పిల్లల నుండి పండు ముసలి వరకు అందరూ ఇష్టంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ పర్వదినాన్ని జరుపుకుంటారు. భాద్రపదం మాసం ప్రారంభంలోనే వచ్చే తొలి పండుగగా వినాయక చవితికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. ఈ పర్వదినం తొలి రోజున, అనగా 27 ఆగస్టున గణేషుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, నియమ నిష్టలతో పూజలు చేసి గణనాథుడి అనుగ్రహం పొందడానికి భక్తులు ప్రయత్నాలు చేస్తారు. ఇంటి పూజ గదిలో పెట్టుకునే చిన్న మట్టి వినాయక విగ్రహం నుంచి అత్యంత భారీ మండపంలో పబ్లిక్ ప్రదేశాల్లో ప్రతిష్ఠించే వినాయక విగ్రహం వరకు ఎక్కడ చూసినా గణేషుడి నామస్మరణమే వినిపిస్తుంది, గణనాథుడి రూపమే దర్శనమిస్తుంది. ఈ పర్వదినాన్ని పశ్చిమ, దక్షిణ భారత ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్నాటక లాంటి రాష్ట్రాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా హిందూ పౌర సమాజం కూడా ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

### వినాయక చవితి ఆధ్యాత్మిక చరిత్ర:

పార్వతి శంకరుల తనయుడు వినాయకుడిని మనకు తెలుసు. వినాయకుడి చిన్నతనంలో తల్లి స్నానం ఆచరించడానికి బిడ్డను కాపలా పెట్టి స్నానాల గదికి వెలుతుంది. ఇంతలో శివయ్య గృహంలే?కి రావడానికి ప్రయత్నిస్తే బుల్లి గణపయ్య అడ్డుకోవడం, ఆవేశంతో శివుడు వినాయకుడి తన నరికి వేయడం జరుగుతుంది. ఈ ఘటనను తెలుసుకున్న పార్వతీ అపార దుఃఖంలో మునిగిపోయి, తనకు కుమారుడు కావాలని కోరడం, విష్ణువు సహాయంతో ఏనుగు శిరస్సును గణపయ్యకు అమర్చడం (నేటి అవయవ మార్పిడి) జరుగుతుంది. ఈ విధంగా పునర్జన్మను పొంది గణేషుడి అవతారమ ఎత్తిన దినంగా వినాయక చవితిని హిందు సమాజం భక్తి ప్రపత్తులతో నిర్వహించడం విశేషం.

### మట్టి వినాయకులతో పూజలు చేద్దాం :

నేడు వినాయక విగ్రహాలను ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్(పిఒపి)తో కాకుండా పర్యావరణహిత మట్టితో చేసిన విగ్రహాలను పూజించడం అధికంగా జరగడం హర్షణీయం. వినాయక చవితి పండుగను 10 రోజుల పాటు ఘనంగా నిర్వహించడం, భక్తి సంగీతం, ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరుగుతుంది. చివరి రోజు అనగా 06 సెప్టెంబర్ 2025న గణేశ విగ్రహాలను ఊరేగింపులు, నాట్యాలతో అత్యంత కోలాహలంగా నిమజ్జన యాత్రను నిర్వహించి సమీప చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేస్తారు. పిప్పితో చేసిన విగ్రహాల తయారీలో వాడిన ప్రమాదకర రంగులు లేదా పాయింట్లు, పిఓపీ, థర్మోకోల్ లాంటి పదార్థాలతో నీరు కలుషితం కావడంతో మానవ వినియోగానికి దూరంగా, జంతువులకు ప్రమాదకరంగా మారడం జరుగుతుంది.

దీనిని నివారించడానికి పర్యావరణ హితమైన మట్టి విగ్రహాలను, గ్రీన్ రంగులను వాడుతూ విగ్రహాలను తయారు చేయడం జరుగుతోంది. గణేషుడిని పది రోజులు పూజించడం, చివరి రోజు నిమజ్జనం చేయడం వల్ల ప్రతి జీవి జీవిత చక్రం సూచించబడుతుందని తెలుసుకోవాలి.

గణేష్ చతుర్థి రాత్రి చంద్రుడిని చూడవద్దని అంటారు. పూజలో తులసి ఆకులు వాడరాదు. పూజ సమయంలో నలుపు లేదా నీలం రంగు వస్త్రాలు ధరించకుండా ఎరుపు, పసుపు రంగు దుస్తులు వాడడం మంచిది. ప్రతి ఏట నూతన్ గణేశ్ విగ్రహాన్ని వాడాలి. విగ్రహాన్ని నేలపై పెట్టకూడదు. వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు సాత్విక ఆహారమే తీసుకోవాలి.

–డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఒక ప్రధాని, మంత్రి, ముఖ్యమంత్రి జైలు నుంచి ప్రభుత్వాన్ని నడపడం అంటే అది దేశ ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే

న్యూఢిల్లీ, ఆగష్టు 26:దేశంలో ఏ మంత్రి అయినా, ముఖ్యమంత్రి అయినా, ప్రధాని అయినా జైలు నుంచి ప్రభుత్వాన్ని నడపలేరని ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృఢంగా విశ్వసిస్తున్నారని కేంద్ర కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా తెలిపారు. ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో, రాజ్యాంగ (130 వ సవరణ) బిల్లు 2025 తో సహా అనేక ముఖ్యమైన అంశాలపై శ్రీ అమిత్ షా తన అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి లేదా రాష్ట్ర మంత్రి ఏదైనా తీవ్రమైన అభియోగం కింద అరెస్టయి 30 రోజుల్లోగా బెయిల్ మంజూరు కాకపోతే వారు తమ పదవి నుంచి వైదొలగవలసిన నిబంధన రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు 2025 లో ఉందని ఆయన పేర్కొన్నారు. అలా జరగని పక్షంలో వారు చట్టపరంగా స్వయంగా పదవి నుంచి తప్పుకోవల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికైన ప్రభుత్వం ఏ బిల్లునైనా, లేదా రాజ్యాంగ సవరణనైనా సభలో ప్రవేశపెట్టడాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకించరాదని శ్రీ షా అన్నారు.

ఈ రాజ్యాంగ సవరణ బిల్లును ఉభయ సభల సంయుక్త పార్లమెంటరీ కమిటీకి నివేదిస్తామని తామే స్వయంగా స్పష్టం చేశామని శ్రీ అమిత్ షా చెప్పారు. ఈ బిల్లు ఆమోదం పొందాలంటే మూడింట రెండొంతుల మెజారిటీ అవసరమని, ఓటింగ్ జరిగినప్పుడు అన్ని పార్టీలు దీనిపై తమ అభిప్రాయాలను చెప్పవచ్చని ఆయన అన్నారు. ఏ బిల్లునుగానీ, , రాజ్యాంగ సవరణ బిల్లునుగానీ సభలో ప్రవేశపెట్టనివ్వకుండా ప్రభుత్వాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు ఎంతమాత్రం తగదని శ్రీ షా అన్నారు. పార్లమెంటు ఉభయ సభలు ఉన్నది చర్చలు, వాదన కోసమే తప్ప అల్లరి, గందరగోళం కోసం కాదని ఆయన అన్నారు. బిల్లును ప్రవేశపెట్టనివ్వని ధోరణి ప్రజాస్వామ్యబద్ధం కాదని, ప్రతిపక్షాలు తమ చర్యలకు దేశ ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని హోంమంత్రి పేర్కొన్నారు.

ఈ బిల్లు ఏ ఒక్క ప్రతిపక్ష పార్టీకి వ్యతిరేకం కాదని, మన ముఖ్యమంత్రులను కూడా దీని పరిధిలోకి తెస్తుందని హోం మంత్రి అన్నారు. ప్రభుత్వంలో ఉన్నవారిపై ఎఫ్ఐఆర్లు నవోదు చేయడం లేదంటూ ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు. 30 రోజుల్లోగా బెయిల్ మంజూరు అయితే బిల్లు ప్రకారం ఎలాంటి చర్యలు ఉండవని, అలాగే, తప్పుడు కేసు అయితే బెయిల్ ఇచ్చేందుకు దేశంలో కోర్టులు ఉన్నాయని ఆయన చెప్పారు. ఏ కేసులో అయినా బెయిల్ ఇచ్చే హక్కు హైకోర్టుకు, సుప్రీంకోర్టుకు ఉందని, బెయిల్ మంజూరు చేయకపోతే ఆ వ్యక్తి రాజీనామా చేయాల్సి ఉంటుందని అన్నారు. ఏ ముఖ్యమంత్రి అయినా, ప్రధాని అయినా, మంత్రి అయినా జైల్లో ఉంటూ ప్రభుత్వాన్ని నడపాలా, ఇది దేశ ప్రజాస్వామ్యానికి మంచిదా? అని ప్రశ్నించారు. 30 రోజుల తర్వాత బెయిల్ మంజూరైతే మళ్లీ ప్రమాణ స్వీకారం చేయొచ్చని చెప్పారు.

జైలు శిక్ష విధించే నిబంధనను తమ ప్రభుత్వం చేయలేదని, అది ఏళ్ల తరబడి కొనసాగుతోందని హోం మంత్రి అన్నారు. ఐదు సంవత్సరాల కంటే ఎక్కువ శిక్షను 130వ రాజ్యాంగ సవరణ తీవ్రమైన నేరంగా పరిగణిస్తుందని, అలాంటి వారు రాజీనామా చేయాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులు, ఐదేళ్లకు పైగా జైలు శిక్ష పడే నేరాల్లో జైలు నుంచి ప్రభుత్వాన్ని నడపడం సరికాదన్నారు ప్రజాప్రాతినిధ్య చట్టంలో ఏ ప్రజాప్రతినిధికైనా రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ శిక్ష పడితే ఎంపీ పదవి నుంచి తప్పించే నిబంధన ఇప్పటికీ ఉందని అన్నారు. నైతిక కారణాలను నిర్ణయించడానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఈ చట్టం అమలులో ఉందని ఆయన అన్నారు. చాలా మంది సభ్యత్వాలను రద్దు చేయడం, నిర్దోషులుగా తేలిన తర్వాత వాటిని పునరుద్ధరించడం జరిగిందని శ్రీ షా గుర్తు చేశారు.

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎంతో మంది నేతలు, మంత్రులు, ముఖ్యమంత్రులు రాజీనామా చేసి జైలుకు వెళ్లారని అమిత్ షా గుర్తు చేశారు. కానీ జైలుకు వెళ్లిన తర్వాత కూడా రాజీనామా చేయని ధోరణి ఇప్పుడు మొదలైందని, తమిళనాడుకు చెందిన కొందరు మంత్రులు, అప్పటి ఢిల్లీ ముఖ్యమంత్రి, మంత్రులు రాజీనామా చేయలేదని అన్నారు. ప్రభుత్వ కార్యదర్శి, డీజీపీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జైలుకు వెళ్లి వారి ఆదేశాలు తీసుకోవాలా అని ప్రశ్నించారు. ఇది తీవ్రంగా తీసుకోవలసిన అంశమని, దీనిపై విస్తృతంగా చర్చ జరగాలని శ్రీ షా అన్నారు.

ప్రధాని మోదీ స్వయంగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని ఈ రాజ్యాంగ సవరణ బిల్లు పరిధిలోకి తీసుకొచ్చారని హోంమంత్రి తెలిపారు.ప్రధాన ప్రతిపక్ష పార్టీకి చెందిన అప్పటి ప్రధాని 39వ రాజ్యాంగ సవరణను తీసుకువచ్చారని, అందులో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతితో పాటు ప్రధాని పదవిని కూడా చట్ట పరిధికి దూరంగా ఉంచారని, కానీ ఇప్పుడు నరేంద్ర మోదీ స్వయంగా ప్రధానమంత్రిని కూడా చేరుస్తూ రాజ్యాంగ సవరణను ప్రవేశపెట్టారని, దీని ప్రకారం ఒకవేళ జైలుకు వెళ్తే ప్రధాని కూడా రాజీనామా చేయాల్సి ఉంటుందని శ్రీ అమిత్ షా అన్నారు. ఈ చట్టంలో కోర్టు జాప్యం ఉండదని, కోర్టు వెంటనే జోక్యం చేసుకోవాల్సి ఉంటుందని ఆయన అన్నారు. న్యాయస్థానాలు కూడా చట్టం తీవ్రతను అర్థం చేసుకుంటాయి కాబట్టి ఇది సత్వర నిర్ణయానికి దారితీస్తుందని పేర్కొన్నారు.

దేశంలో ఏ మంత్రి, ముఖ్యమంత్రి లేదా ప్రధానమంత్రి జైలులో ఉన్నప్పుడు ప్రభుత్వాన్ని నడపలేరని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చాలా స్పష్టంగా విశ్వసిస్తున్నారని శ్రీ అమిత్ షా అన్నారు. రాజ్యాంగాన్ని తయారుచేసే సమయంలో ఏ ముఖ్యమంత్రి కూడా జైలుకు వెళ్లి పదవిలో కొనసాగుతారని రాజ్యాంగ నిర్మాతలు ఊహించి ఉండరని ఆయన అన్నారు. మన నైతిక విలువల స్థాయిని పడిపోనివ్వకూడదని ఆయన అన్నారు. ఈ చట్టం నైతిక విలువల స్థాయికి పునాది వేస్తుంది. మన ప్రజాస్వామ్యాన్ని కచ్చితంగా బలోపేతం చేస్తుంది. మన న్యాయస్థానాలు సునిశితమైనవని, ఎవరైనా తమ పదవులను కోల్పోతే కచ్చితంగా కోర్టులు నిర్ణీత గడువులోగా బెయిల్ పై నిర్ణయం తీసుకుంటాయని ఆయన అన్నారు.

కక్షసాధింపు గురించి ప్రధాన ప్రతిపక్షం మాట్లాడటం తగదని, ప్రతిపక్ష ప్రభుత్వ హయాంలో కనీసం 12 కేసుల్లో కోర్టు ఆదేశాలతో సీబీఐ దర్యాప్తు జరిగిందని, చాలామందిని కేసుల్లోకి నెట్టారని హోం మంత్రి గుర్తు చేశారు. ప్రతిపాదిత చట్టంపై జేపీసీ ఏర్పాటు చేయాలని నిర్ణయించిన తర్వాత కూడా ఏదైనా పార్టీ దాన్ని బహిష్కరిస్తే, ప్రభుత్వానికి వేరే ప్రత్యామ్నాయం ఉండదని ఆయన అన్నారు. ఈ బిల్లు ముఖ్యమని, అందువల్ల అన్ని పార్టీల సభ్యులతో సంప్రదించి జేపీసీ అభిప్రాయం తీసుకోవాలని శ్రీ షా అన్నారు. ప్రతిపక్షాలకు తమ అభిప్రాయాలను తెలియజేయడానికి ప్రభుత్వం అవకాశం ఇస్తోందని, కానీ ప్రతిపక్షాలు తన అభిప్రాయాలను తెలియజేయడానికి ఇష్టపడటం లేదని, దేశ ప్రజలు దీనిని గమనిస్తున్నారని ఆయన అన్నారు.ఎవరైనా తీవ్రమైన అవినీతికి పాల్పడితే అరెస్టు చేస్తారని, జైలుకు వెళ్లక తప్పదని, రాజీనామా చేయాల్సి ఉంటుందని హోంమంత్రి స్పష్టం చేశారు.

నైతిక విలువలపై ప్రతిపక్షాలు తనకు పాఠాలు చెప్పకూడదని శ్రీ అమిత్ షా అన్నారు. తనపై ఆరోపణలు వచ్చి, సీబీఐ తనకు సమన్లు పంపడంతో మరుసటి రోజే తాను రాజీనామా చేశానని, తరువాత తాను నిర్దోషిగా తీర్పు వచ్చిందని ఆయన గుర్తు చేశారు. ఆ తీర్పులో ఇది పూర్తిగా కక్ష సాధింపు కేసు అని, తనకు ఆ కేసుతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. తనను ఆధారాలు లేని కారణంగా నిర్దోషిగా ప్రకటించలేదని, తనపై నమోదైన కేసునే కొట్టివేశారని శ్రీ షా తెలిపారు. 96వ రోజున తనకు బెయిల్ మంజూరైందని, అయినా తాను హోంమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయలేదని చెప్పారు. అంతేగాక, తనపై ఉన్న అభియోగాలన్నీ కొట్టివేసే వరకు తాను ఏ రాజ్యాంగ పదవినీ తీసుకోలేదని చెప్పారు.

నైతిక విలువలు ఎన్నికల గెలుపు ఓటములతో ముడిపడి లేవని అమిత్ షా అన్నారు. అవి సూర్యచంద్రుల మాదిరి స్థిరంగా వాటి స్థానంలో ఉంటాయని శ్రీ అమిత్ షా అన్నారు. తమ మిత్రపక్షాలన్నీ ఈ సూత్రంతో పూర్తిగా ఏకీభవిస్తున్నాయని ఆయన చెప్పారు. పార్లమెంటు ఎలా పనిచేయాలో నిర్ణయించేది అధికార పార్టీ మాత్రమే కాదని శ్రీ అమిత్ షా అన్నారు. ప్రతిపక్షాలు ఏ బిల్లుకైనా, రాజ్యాంగ సవరణకైనా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించకపోతే దేశ ప్రజలు దానిని గమనిస్తారని పేర్కొన్నారు. ఈ బిల్లు ఆమోదం పొందుతుందని, నైతిక విలువల ప్రాతిపదికన మద్దతిచ్చే వారు ప్రతిపక్షంలో చాలా మంది ఉంటారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## హాకీ ఆసియా కప్ 2025 ట్రోఫీని ఆవిష్కరించిన డాక్టర్ మన్సుఖ్ మాండవీయ

బీహార్ లోని రాజ్గిర్ హాకీ స్టేడియంలో ఈనెల 29 నుంచి సెప్టెంబర్ 7 వరకు జరగనున్న హాకీ పురుషుల ఆసియా కప్ 2025 పోటీల ట్రోఫీని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు, కార్మిక, ఉపాధి శాఖల మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ఈరోజు ఆవిష్కరించారు. దీనితో టోర్నమెంట్ 12వ ఎడిషన్ కౌంట్డౌన్ ప్రారంభమైంది.

ప్రధాన అంతర్జాతీయ హాకీ టోర్నమెంట్ మొదటిసారి బీహార్ లో జరుగుతుండడంతో రాజ్ గిర్ ఎడిషన్ రాష్ట్ర క్రీడా ప్రతిష్ఠను మరింత పెంచే దిశగా చారిత్రాత్మకం కానుంది,

మూడుసార్లు ఒలింపిక్స్ పతాకాన్ని గెలిచిన హర్బిందర్ సింగ్, 1972 ఒలింపిక్స్ కాంస్య పతక విజేత అశోక్ ధ్యాన్ చంద్, 1980 మాస్కో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత జాఫర్ ఇక్బాల్ తో పాటు బీహార్ ప్రభుత్వఅధికారులు, హాకీ ఇండియా అధికారులు ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ ఏడాది ఆసియా కప్ 2026 లో నెదర్లాండ్స్, బెల్జియంలలో జరిగే ఎఫ్ఐహెచ్ పురుషుల హాకీ ప్రపంచ కప్ కు ప్రత్యక్ష అర్హత పోటీగా నిలుస్తుంది. ఈ టోర్నమెంట్ విజేత ఆ పోటీలకు నేరుగా అర్హత సాధిస్తారు. రెండు నుంచి ఆరో స్థానంలో నిలిచిన జట్లు వచ్చే ఏడాది జరిగే ప్రపంచ కప్ అర్హత పోటీలలో పాల్గొంటాయి.

## మట్టి గణపతినే పూజించండి.. పర్యావరణాన్ని కాపాడండి.. బెల్లంపల్లి సబ్ కలెక్టర్



హైదరాబాద్, ఆగష్టు 26:గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ అన్నారు. అభినవ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో మంగళవారం తాండూర్ ఐబీ చౌరాస్తాలో ఉచితంగా మట్టి గణపతులు, మొక్కలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమానికి హాజరైన సబ్ కలెక్టర్ కూడా మట్టి ప్రతిమలను, మొక్కలను అందించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అభినవ స్వచ్ఛంద సేవా సంస్థ తోడ్పాటుతో మట్టి వినాయకులతో పాటు ఒక మొక్కను ఇవ్వడం అభినందనీయమని ఆయన తెలిపారు. తాండూర్ తెలంగాణ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దేవరకొండ రాజన్న ఆధ్వర్యంలో క్లబ్ ప్రతినిధులు తాండూర్ ఐబీలో మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోత్స్న, అధికారులు, నాయకులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, అభినవ సేవా సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కుభీర్ గణపతులకు ప్రత్యేక గుర్తింపు.. రాష్ట్ర, జిల్లా స్థాయిలో అవార్డులు

**–ఆలోచింపజేసే వినాయక విగ్రహాల తయారీ**
**–మహారాష్ట్రతోపాటు జిల్లా నలుమూలల నుంచి ఆర్డర్లు**
**–ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, నాందేడ్, యావత్మాల్ జిల్లాలకు విగ్రహాలు**

నిర్మల్, ఆగష్టు 26: జిల్లాలోని మండల కేంద్రం కుభీర్ వినాయక విగ్రహాల తయారీకి కేంద్ర బిందువుగా నిలుస్తోంది. కుభీర్కు చెందిన పర్వత్వార్ సాయిశ్యామ్ తన 13వ ఏట నుంచి విగ్రహాలను తయారు చేస్తున్నారు. సుమారు 20 ఏళ్ల కిందట అతను మట్టితో చిన్నచిన్న ప్రతిమలను తయారు చేసి విక్రయించేవారు. ఆ తర్వాత ప్లాస్టర్ ఆఫ్ పారిస్తో ప్రారంభించారు.

కుభీర్లోని శివసాయి ఆలయ సమీపంలో అతను ఖాళీ స్థలాలను కొనుగోలు చేసి, రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడే విశ్వబ్రహ్మ కళాధామం ఏర్పాటు చేశారు. వినాయక విగ్రహాలే కాకుండా కర్రతో చేసిన అనేక రకాల విగ్రహాలు, జాతీయ నాయకుల ప్రతిమలతోపాటు బండరాళ్లపై చెక్కిన శిల్పకళ శ్యామ్కు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. మహారాష్ట్రతోపాటు ఇక్కడి వివిధ ఆలయాలకు బండరాళ్లపై చెక్కిన విగ్రహాలను అందించారు.

ప్రతి ఏటా వివిధ రకాల ఆకృతులు విభిన్నమైన అంశాలతో కూడిన వినాయక విగ్రహాలను తయారు చేసి కుభీర్ అంటేనే వినాయక విగ్రహాలకు పెట్టింది పేరుగా గుర్తింపు తీసుకొచ్చారు. రాజస్థాన్ నుంచి ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఆంధ్ర నుంచి కొబ్బరి పీచును తెప్పించుకొని ఈ విగ్రహాలకు వినియోగిస్తుంటారు. పెద్ద పరిశ్రమగా తయారైన ఈ కేంద్రంలో ఏడాది పొడవునా పది నుంచి 20 మందికి ఉపాధి దొరుకుతుంది.

ప్రత్యేకంగా హైదరాబాద్, విజయవాడ, మహారాష్ట్రలోని నాందేడ్ పట్టణాల నుంచి రంగురంగుల వస్త్రాలు, పట్టుపంచలు, కండువాలు, మెరుపును తెప్పించి విగ్రహాలకు అలంకరిస్తారు. నిర్మల్ జిల్లాలో విగ్రహాల తయారీ కేంద్రాలు స్వల్పంగా ఉన్నప్పటికీ అందులో నాలుగైదు రకాల విగ్రహాలు మాత్రమే అచ్చులతో తయారు చేస్తారు. కానీ కళాకారుడు సాయి శ్యామ్ తయారు చేస్తున్న విగ్రహాలు వివిధ రకాలుగా అందర్నీ ఆకర్షించే విధంగా ఉంటున్నాయి.అందుకే ఆరు నెలల ముందుగానే ఆర్డర్లు ఇస్తారు. మూడు అడుగుల నుంచి సుమారు 15 అడుగుల వరకు విగ్రహాలు వందల సంఖ్యలో తయారు చేస్తారు. ఈయన చేసిన విగ్రహాలకు డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. విగ్రహాల తయారీలో పెరుగాంచిన సాయి శ్యామ్ను రాష్ట్రస్థాయిలో ట్రూ ఇండియన్ అవార్డు, గోల్కొండ హ్యాండీక్రాఫ్ట్ తెలంగాణ అవార్డు, ఉత్తమ శిల్ప కళాకారుడిగా జిల్లాస్థాయిలో కలెక్టర్ చేతుల మీదుగా పలుమార్లు అవార్డులు అందుకున్నారు.

రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ హైదరాబాద్ కమిషనర్ శైలజా రామయ్యర్ కుభీర్లోని కళాధామాన్ని సందర్శించి కళాకారుడు సాయి శ్యామ్ను అభినందించారు. తమ సంస్థపరంగా కర్ర, బండ రాళ్లతో చేసిన ప్రతిమలను విక్రయించుకునేందుకు ఎగ్జిబిషన్ స్టాల్ను ఏర్పాటు చేసుకునేందుకు సహకరిస్తామని పేర్కొన్నారు. మనిషిని చూసి అలాగే ప్రతిమ తయారు చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఆయన తయారు చేసే విగ్రహాలకు గిరాకీ ఎక్కువ, ఒక్క విగ్రహం కూడా మిగిలిపోవడం ఉండదు.కాగా గత 20 ఏళ్లుగా తన కళకు పదునుపెట్టి విభిన్న ఆకృతులలో వినాయక విగ్రహాలు తయారుచేస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన సాయి శ్యామ్ను అందరూ అభినందిస్తున్నారు.

## యూరియా కోసం మునగాల పీఏసీఎస్ వద్ద రైతుల తిప్పలు

నల్గొండ, ఆగషు 26: మునగాల మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలో యూరియా కోసం రైతుల అవస్థలు అంతా ఇంతా కాదు. బస్తా యూరియా కోసం రైతులు నాన్న తిప్పలు పడాల్సిన దుస్థితి దాపురించింది. మంగళవారం సొసైటీ వద్ద తోపులాట జరగకుండా పోలీస్ పహారా ఏర్పాటు చేశారు. రోజంతా నిలబడ్డా యూరియా దొరకకపోవడంతో పంట పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుని రాజును చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం, రైతులు ఇలా పడిగాపులు పడే పరిస్థితికి తీసుకువచ్చిందని అసహనం వ్యక్తం చేశారు.

## మధిర ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్ర పురస్కారాలు



ఖమ్మం, ఆగష్టు 26: ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి తోడ్పడే ప్రతిభను ప్రోత్సహిస్తూ ఖమ్మం రీజియన్ పరిధిలోని ఏడు డిపోల్లో డ్రైవర్లు, కండక్టర్లతో పాటు మెకానిక్, సిబ్బందికి అవార్డుల ప్రధాన కార్యక్రమం మంగళవారం మధిర డిపోలో నిర్వహించారు. మధిర ఆర్టీసీ డిపోలో ప్రగతి చక్ర పురస్కార అవార్డులను ఖమ్మం రీజినల్ మేనేజర్ హరి రామ్ మంగళవారం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ? ఆర్టీసీ సంస్థను ప్రగతి పథంలో నడిపించడం ఉద్యోగుల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ఖమ్మం రీజియన్లో ఏడు డిపోలలో సిబ్బంది ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ఇలాంటి ఉద్యోగులు ఉండడం వల్లే సంస్థకు గుర్తింపు, ప్రయాణికులకు సుఖ ప్రయాణం జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మరి డిపో మేనేజర్ శంకర్రావు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, అకౌంట్ ఆఫీసర్ జోస్నా, పర్సనల్ ఆఫీసర్ సంపత్ కుమార్, ఉమ్మడి ఖమ్మం సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణ షెడ్యూల్ విడుదల.. సెప్టెంబర్ 2న తుది జాబితా..!

హైదరాబాద్, ఆగష్టు 26:తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. సెప్టెంబర్ 30లోపు ఎలక్షన్లు నిర్వహించాలని హై కోర్టు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో ఎన్నికల సంఘం పంచాయతీల్లో ఓటరు జాబితా సవరణ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 28న పంచాయతీలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితా సవరణ చేస్తామని ఈసీ తెలిపింది.ఆగస్టు 29న జిల్లా స్థాయి పార్టీ నేతలతో, 30న మండల స్థాయి పార్టీ ప్రతినిధులతో భేటీ అవుతామని ఈసీ ప్రకటించింది. ఆగస్టు 28 నుంచి 30వ తేదీ వరకూ అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపింది. సెప్టెంబర్ 2న తుది జాబితా విడుదల చేస్తామని ఎన్నికల సంఘం వెల్లడించింది.

## మెహదీపట్నం బస్టాండ్లో సిటీ బస్సులో అకస్మాత్తుగా చెలరేగిన మంటలు

**– డ్రైవర్ అప్రమత్తత వల్ల ప్రయాణికులు సురక్షితం**

హైదరాబాద్ ఆగష్టు 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్);హైదరాబాద్ మెహిదీపట్నంలో పెను ప్రమాదం తప్పింది. మెహిదీపట్నం బస్టాండ్లో ఓ సిటీ బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే బస్సును రోడ్డు పక్కన నిలిపివేశాడు. అనంతరం ప్రయాణికులను అందర్నీ కిందకు దించేశాడు. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం పూర్తిగా కాలిపోయింది. డ్రైవర్ అప్రమత్తత వల్ల ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.



కిన్నెర ఆర్ట్ థియేటర్స్ & మాతృభాషా సమితి-ఆహ్వానం



తెలుగు భాషా దినోత్సవ సందర్భంగా
డా॥ సగిలి సుధారాణిగారు
సంపాదకత్వం వహించిన
ప్రాచీన తెలుగు
మార్గాన్వేషణ-పరిష్కరణ
శాసనాలు-నాణేలు-తాళపత్రాలు- లిపి
గ్రంథావిష్కరణ
శుక్రవారం 29-8-2025, సా॥ 5:30 గంటలకు
తెలంగాణ సారస్వత పరిషత్, తిలక్ రోడ్, అబిడ్స్, హైదరాబాద్

ముఖ్యఅతిథి : శ్రీ యన్. రామచంద్రరావు, అధ్యక్షులు, భారతీయ జనతాపార్టీ, తెలంగాణ
అధ్యక్షులు : డా॥ కె.వి.రమణ, ఐఎఎస్ (రి), పూర్వ సలహాదారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
సభాప్రారంభకులు : ఆచార్య వెలుదండ నిత్యానందరావు, ఉపాధ్యక్షులు, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం
విశిష్ట అతిథి : శ్రీ యం. నాగేశ్వరరావు, సంపాదకులు, ఈనాడు ఆంధ్రప్రదేశ్
ఆత్మీయ అతిథి : డా॥ శ్రీరంగాచార్య, ప్రముఖ సాహితీ వేత్త
గౌరవ అతిథి : డా॥ చింతపల్లి వసుంధరా రెడ్డి, మాతృభాషా సమితి అధ్యక్షురాలు

సాంస్కృతిక కార్యక్రమం : సా॥ 5:30 నుండి 6-30 వరకు నృత్య కిన్నెర సమర్పించు
మా తెలుగు తల్లికి మల్లెపూదండ కూచిపూడి నృత్య రూపకం
నృత్య దర్శకత్వం: హంస పురస్కార గ్రహీత, కేంద్ర సంగీత నాటక అకాడమి పురస్కార గ్రహీత
డా॥ మద్దాళి ఉషాగాయత్రి
రచన : శ్రీ బ్నిం సంగీతం: శ్రీమతి వెంపటి శ్రీవల్లీ శర్మ

డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐపిఎస్ (రి), అధ్యక్షులు, కిన్నెర
ఎస్.ఎస్.రాజు, గౌ॥ అధ్యక్షులు, మాతృభాషా సమితి
మద్దాళి రఘురామ్, కార్యదర్శి, కిన్నెర

# రైతుల గోడు పట్టని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు : తుమ్మల వీరారెడ్డి




నల్లగొండ, ఆగస్టు 26 : రైతాంగం పంట పొలాలను కాపాడుకోవడం కోసం యూరియా సకాలంలో అందించండి అని రోడ్డెక్కి ఆందోళన చేస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు యూరియా కష్టాలు, రైతుల గోడు పట్టదా అని సిపిఐఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. రైతులకు సకాలంలో యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిపిఐఎం కార్యాలయం నుంచి జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం వరకు పార్టీ శ్రేణులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో యూరియా కొరతకు ఎవరు కారకులో అందరికీ తెలిసినా, పర్యవేక్షించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడమే ఈ దుస్థితి దాపురించిందని దుయ్యబట్టారు.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 9 వేల లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయాల్సి ఉండగా నామమాత్రంగా సరఫరా చేసిందన్నారు. నల్లగొండ జిల్లాకు 70 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరముందని జిల్లా వ్యవసాయ అధికారులు గుర్తిస్తే, ఇప్పటివరకు కేవలం 49 వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా జరిగిందని తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన కోటాను తెప్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చేస్తుందని, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేసి కృత్రిమ కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని, రైతులకు యూరియా సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతాంగం రోడ్డెక్కి పాస్ బుక్స్, ఆధార్ కార్డులు, చెప్పులు పెట్టి క్యూ లైన్లు కడుతుంటే, రైతులకు సరఫరా యూరియా అందించకుండా ఒకరికి ఒక బస్తా మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని 5 నుండి 10 ఎకరాల పంటలకు ఒక యూరియా బస్తా ఎలా సరిపోతుందని ఆయన ప్రశ్నించారు.

అదును దాటితే దిగుబడిపై ప్రభావం

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. యూరియా కొరతతో నల్లగొండ జిల్లా రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. ఒకవైపు వర్షాలు పడుతుంటే యూరియా లేకపోవడంతో సేద్యం చేసిన పంటలు తగిన దిగుబడి రావన్నారు. రామగుండం యూరియా కంపెనీ ఉత్పత్తిని ఆపేసిందని ప్రచారం జరుగుతుంది, ఎందుకు ఆపేసిందో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధాలు కారణమని ఒకరి మీద ఒకరు సాకులు చెబుతున్నారన్నారు. రాష్ట్రంలో ఉన్న 8 మంది ఎంపీలు అందులో ఇద్దరు కేంద్ర మంత్రులు రాష్ట్రానికి రావాల్సిన యూరియా కోటాను ఇప్పించడంలో ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. బీజేపీ శ్రేణులు గల్లీలో కాదు ఢిల్లీలో ధర్నాలు చేయాలన్నారు. కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి స్పందించి రాష్ట్రానికి రావాల్సిన యూరియా కోటాను రైతులకు అందించాలని కోరారు. ఇప్పటికైనా స్పందించి సకాలంలో యూరియాను సరఫరా చేయకపోతే సిపిఐఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నారి ఐలయ్య, డి.మల్లేశ్, బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, ప్రభావతి, కందాల ప్రమీల, సయ్యద్ హాశం, చినపాక లక్ష్మీనారాయణ, వీరపల్లి వెంకటేశ్వర్లు, ఎండీ సలీం, పి.నర్సిరెడ్డి, దండంపెల్లి సత్తయ్య, బొజ్జ చిన్న వెంకులు, వెంకట రమణారెడ్డి, జిట్ట నగేశ్, అవిశెట్టి శంకరయ్య, పి.వరలక్ష్మి, జిట్టా సరోజ, కొండ అనురాధ, వెంకన్న, వినోద్ నాయక్, సైదులు, మల్లయ్య, శ్రీనివాస్, మల్లం మహేశ్, గంజి మురళీధర్, పద్మ, రవి, నరసింహ, కుంభం కృష్ణారెడ్డి, మధు పాల్గొన్నారు.

# జేఎన్ఎస్‌లో ఉత్సాహంగా వెటరన్ వాలీబాల్ పోటీలు

హన్మకొండ, ఆగస్టు 26: హాకీ దిగ్గజం, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్) మంగళవారం వెటరన్ వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హనుమకొండ డీవైఎస్వో గుగులోత్ అశోక్‌కుమార్ హాజరై మాట్లాడారు.

ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ప్రతిరోజు జేఎన్ఎస్‌లో క్రీడాపోటీలతో పాటు ఇతర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు, ఈ క్రమంలో మంగళవారం వాలీబాల్ పోటీలు నిర్వహించామని తెలిపారు. ఇందులో గెలుపొందిన క్రీడాకారులకు ఈనెల 29వ తేదీ సాయంత్రం 4 గంటలకు బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందన్నారు.

# గణేశ్ నవరాత్రి ఉత్సవాలు.. పోలీసుల విస్తృత తనిఖీలు



మెదక్, ఆగస్టు 26:చిలిపిచెడ్ మండలంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ నర్సింలు సూచించారు. మంగళవారం నవరాత్రుల సందర్భంగా ప్రజల భద్రత, శాంతిభద్రతా వ్యవస్థల పర్యవేక్షణ కోసం చిలిపిచెడ్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మెదక్ జిల్లా పోలీస్ ఉన్నతాధికారి డీవీ శ్రీనివాస్ ఆదేశాలతో చిలిపిచెడ్‌లో ఉన్న ప్రధాన చాముండేశ్వరి ఆలయం, డాబాలు ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, బస్ స్టాండ్లు, ముఖ్యమైన ఆధ్యాత్మిక ప్రాంతాలలో డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ సహకారంతో విస్తృత తనిఖీలు నిర్వహించారు.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ, ఎలాంటి అసాంఘిక శక్తులు లేదా అనుమానాస్పద వ్యక్తుల కదలికలు ఉన్నా వెంటనే గుర్తించేలా పర్యవేక్షణ చేపట్టారు.

అలాగే గంజాయి, మాదక ద్రవ్యాలు,. నిషేధిత పదార్థాల రవాణా, విక్రయం, వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని, అనుమానిత ప్రాంతాలను తనిఖీ చేసి ప్రత్యేక దృష్టి సారించామని డీవీ శ్రీనివాస్ తెలిపారు.

ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగలలో పాల్గొనేందుకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా లేదా అసాంఘిక కార్యకలాపాలు గమనించినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్-100 కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పోలీసులు పౌరుల సహకారంతోనే పండుగలు సజావుగా, శాంతియుతంగా జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# 'పీపీఆర్ వ్యాక్సిన్‌తో గొర్రెలు, మేకల్లో పారుడు వ్యాధి నివారణ'

నల్గొండ, ఆగషు 26:గొర్రెలు, మేకలకు వచ్చే పారుడు వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న పి పి ఆర్ వ్యాక్సిన్‌ను పెంపకందారులు తప్పక వేయించాలని నల్లగొండ మండల పశువైద్య అధికారి కోట్ల సందీప్ రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని దోమలపల్లి గ్రామంలో గొర్రెలు, మేకలకు పిపిఆర్ వ్యాక్సినేషన్ చేసి మాట్లాడారు. పారుడు వ్యాధి ఓ వైరస్ వల్ల వస్తుందని, ఈ వ్యాధి రావడంతో జీవాల్లో జీర్ణ, శ్వాస, నాడీ వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. వంద శాతం సబ్సిడీతో రైతులకు ఉచితంగా ఈ టీకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఎల్ఓ డాక్టర్ సుజాత, ఓఎస్లు ఎం రేణుక, శివశంకర్, మాధవి రైతులు పాల్గొన్నారు.

# అంతర్ జిల్లా మేకల దొంగల ముఠా అరెస్ట్

## - రూ.2.40 లక్షల నగదు, 22 గొర్రెలు, 8 కార్లు సీజ్

## -వివరాలు వెల్లడించిన ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్గొండ, ఆగషు 26:ఖరీదైన కార్లలో రాత్రి సమయాల్లో మేకల దొంగతనాలకు పాల్పడుతున్న 16 మందితో కూడిన నాలుగు అంతర్




జిల్లా దొంగల ముఠాలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. నిందితుల వద్ద నుండి రూ.2.46 లక్షల నగదు, 22 గొర్రెలు, రూ.17 లక్షల విలువ గల 8 కార్లను స్వాధీనం చేసుకున్నట్లు వెలడించారు. మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత కొంత కాలంగా జిల్లాలో మేకలు, గొర్రెలు వరుసగా చోరీకి గురైతున్న నేపథ్యంలో జిల్లాలో ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం సమయంలో శాలిగౌరారం మండలంలోని బైరవోనిబండ క్రాస్ రోడ్ వద్ద వాహన తనిఖీలు చేపడుతున్న సమయంలో అటుగా వచ్చిన షిఫ్ట్ డిజైర్ కారును తనిఖీ చేసేందుకు దగ్గరకు వెళ్తుండగా అందులోని వారు తప్పించుకుని పారిపోయేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు.

వెంటనే వాహనాన్ని వెంబడించి పట్టుకోగా అందులో ముగ్గురు పురుషులు, ఓ మహిళ ఉన్నట్లుగా తెలిపారు. వారి వేలి ముద్రలను స్కాన్ చేయడంతో సంఘం, వెంకటేశ్, వెంరెడ్డి శ్రీనివాసరెడ్డి, సంపంగి శారద, దాసర్ల వినోద్ కుమార్ అలియాస్ కోటిగా గుర్తించినట్లు తెలిపారు.

వీరిపైన గతంలో నల్లగొండ రూరల్, కనగల్, చండూర్, విజయపురి, నార్కట్‌పల్లి, నల్లగొండ 2 టౌన్, మర్రిగూడ, దేవరకొండ, శాలిగౌరారం, నాంపల్లి, మునుగోడు, చింతపల్లి పోలీస్ స్టేషన్లలో మేకల దొంగతనాల కేసులు నమోదై అరెస్టై జైలుకు వెళ్లి వచ్చినట్లు వెల్లడించారు. వీరితో పాటు పరిచయం ఉన్న మరో 12 మందితో కలిసి నాలుగు ముఠాలుగా ఏర్పడినట్లు తెలిపారు. పట్టుబడిన వారు ఒక గ్యాంగ్‌గా వరికుప్పల రవి ఏ చింటూ, గండికోట శివకుమార్, అమ్ములూరి విజయ్, వరికుప్పల రాజు, లింగాల ఆశోక్, ఉండం కళ్యాణి, కౌటేశ్ ( లక్ష్మి, కనుకుల బేబీ, రెండో గ్యాంగ్‌గా వల్లెపు ప్రసాద్, మత్యాల సహదేవ్, మూడో గ్యాంగ్‌గా కోడిసే వంశీ కృష్ణ, కంపాటి హుస్సేన్, కంపాటి అజయ్ కుమార్, మట్టి సురేశ్ నాలుగు గ్యాంగ్‌లుగా ఏర్పడినట్లు తెలిపారు. వీరంతా ఎవరికీ అనుమానం రాకుండా ఖరీదైన కార్లలో వచ్చి పగటి పూట రెక్కి నిర్వహించి రాత్రి సమయాల్లో వచ్చి మేకలు, గొర్రెలను కార్లలో వేసుకుని దొంగతనాలకు పాల్పడేవారన్నారు.

విచారణలో వీరంతా జిల్లాలో 15 చోట్ల, రాచకొండ, సైబరాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల పరిధిలో 10 చోట్ల మేకల దొంగతనాలకు పాల్పడినట్లు తేలిందన్నారు. దొంగలించిన మేకలను సంతల్లో అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తుండేవారన్నారు. మొత్తం 23 నేరాలకు సంబంధించి 200కు పైగా మేకలు, గొర్రెలు అమ్మినట్లు తెలిపారు. కేసును నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి పర్యవేక్షణలో చేధించారు. డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, నల్లగొండ సీసీఎస్ సీఐలు ఎం.జితేందర్ రెడ్డి. ఎం.నాగభూషణ్, శాలిగౌరారం సీఐ కె.కొండల్ రెడ్డి, నార్కట్ పల్లి సీఐ కె. నాగరాజు, ఎస్ఐలు శివకుమార్, విజయ్ కుమార్, రవి, రవి కుమార్, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధన గిరి, వహీద్ పాషా, సూఫీయాన్ అలీ, రామ్ ప్రసాద్, నాగరాజు, సీసీఎస్ కానిస్టేబుల్ అశ్రార్, మహేశ్, సాయి, వెంకట్ రామ్‌ను ఎస్పీ అభినందించారు. వారికి ప్రత్యేకంగా ప్రశంసా పత్రాలు, రివార్డులు అందజేశారు

# దళారుల జోక్యం లేకుండా నేరుగా ప్రజలకు సాండ్ బజార్ నుండి ఇసుక ను సరఫరా

## -ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు నాణ్యమైన ఇసుక ను అందించటమే లక్ష్యంగా సాండ్ బజార్ ల ఏర్పాటు .

## -సాండ్ బజార్ ప్రారంభోత్సవం .. ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన ఇసుక సరఫరా

## -వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా



సంగారెడ్డి ఆగస్టు 26(నేటి నిజం ప్రతినిధి )సంగారెడ్డి జిల్లా పరిధిలో,ఆందోల్ నియోజకవర్గం లో, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగుపేట ? జోగిపేట చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాండ్ బజార్ను మంగళవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజలకు నాణ్యమైన ఇసుకను సరసమైన ధరలో అందించడం ప్రభుత్వ ప్రాధాన్య కర్తవ్యం. దళారుల బెడద లేకుండా, పారదర్శక పద్ధతిలో, నేరుగా ప్రజలకు ఇసుక అందించేందుకు ప్రభుత్వం సాండ్ బజార్లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు .ఇసుక తరలింపు వాహనాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు కూడా నిర్వహించారు.

ప్రతి 20 కిలోమీటర్ల పరిధిలో సాండ్ బజార్లు,ఆందోల్ నియోజకవర్గం సహా జిల్లాలో ప్రతి 20 కిలోమీటర్ల పరిధిలో ఒక సాండ్ బజార్ ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీని వలన ప్రజలు తక్కువ దూరంలోనే అవసరమైన ఇసుకను సులభంగా పొందగలరని ఆయన పేర్కొన్నారు

ఇళ్ల నిర్మాణం, ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడటమే లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

సంగారెడ్డి జిల్లాలో సహజసిద్ధమైన ఇసుక రీచ్‌లు లేవు. ఈ కారణంగా ఇక్కడి ప్రజలు ఇప్పటివరకు అధిక ధరలకు, మధ్యవర్తుల ద్వారా ఇసుక కొనుగోలు చేయవలసి వచ్చేది. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సాండ్ బజార్లను ఏర్పాటు చేసింది.

ఇకపై లబ్ధిదారులు, గృహనిర్మాణదారులు తక్కువ ధరలో, నాణ్యమైన ఇసుకను ఈ బజార్ల ద్వారా పొందవచ్చని మంత్రి తెలిపారు.ఇసుక కొరత సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లు అయిందన్నారు

సాండ్ దళారుల బెడదను పూర్తిగా అరికట్టాలని మంత్రి స్పష్టం చేశారు. ఇసుక సరఫరా ప్రక్రియలో ఎవరైనా దళారుల మాదిరిగా వ్యవహరించినా, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మైనింగ్ కార్పొరేషన్, రెవెన్యూ, హౌసింగ్, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఇసుక సరఫరాను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

ప్రభుత్వం తరఫున మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం లో ఇసుక కొరత సమస్య రాకూడదు. లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, వారికి కావలసినంత ఇసుక సాండ్ బజార్లలో నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి అని మంత్రి అధికారులను ఆదేశించారు.సాండ్ బజార్ల ఏర్పాటు వలన స్థానిక కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. చిన్న కాంట్రాక్టర్లు, మేస్త్రీలు కూడా నాణ్యమైన ఇసుకను సులభంగా పొందగలరని అధికారులు తెలిపారు.

ఇసుక సరఫరా ఆన్‌లైన్‌లోనూ పర్యవేక్షణ జరుగుతుందని, ఎవరైనా అక్రమ రవాణా చేస్తే వెంటనే గుర్తించి చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

ఈ కార్యక్రమం లో టీజీఎండిసి ఎండి భవేష్ మిశ్రా , జిల్లా అదనపు ( స్థానిక సంస్థలు)కలెక్టర్ చంద్రశేఖర్ , జిల్లా. మైన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రఘుబాబు,జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి , మార్కెఫెడ్ డైరెక్టర్ శేరి జగన్ మోహన్ రెడ్డి , పిఏసిఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి , హౌసింగ్ , రెవిన్యూ , పోలీస్ , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు .

# పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి : మల్లెల రవీంద్ర ప్రసాద్

కారేపల్లి, ఆగస్టు 26 : ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని కారేపల్లి మండల పంచాయతీ అధికారి మల్లెల రవీంద్ర ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని బాజుమల్లాయిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్నందున లోతట్టు ప్రాంతాలు, వరద నీటి ముంపులో నివాసముంటున్న ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేసి దోమల నివారణ మందులను చల్లాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల భారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

# త్రివిధ దళాల సహకారంతోనే సుదర్శన చక్ర ప్రాజెక్టు సాధ్యం : సీడీఎస్ అనిల్ చౌహాన్




భోపాల్, ఆగష్టు 26: సుదర్శన చక్ర వైమానిక రక్షణ వ్యవస్థ ఏర్పాటు అంశంపై త్రివిధ దళాధిపతి అనిల్ చౌహాన్ మాట్లాడారు. మధ్యప్రదేశ్‌లోని ఆర్మీ వార్ కాలేజీలో రణ్ సంవాద్ అనే అంశంపై జరిగిన కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. సుదర్శన చక్ర రక్షణ వ్యవస్థను రూపొందించేందుకు త్రివిధ దళాల సహకారం అవసరం ఉంటుందన్నారు. త్రివిధ దళాల మిలిటరీ సర్వీసులను బలోపేతం చేయాల్సి ఉంటుందన్నారు. మిస్సైళ్లు, నిఘా వ్యవస్థలను బలోపేతం చేస్తేనే.. శత్రుదుర్భేద్యమైన వ్యూహాత్మక రక్షణ వ్యవస్థ రూపొందించడం వీలు అవుతుందని సీడీఎస్ అనిల్ చౌహాన్ పేర్కొన్నారు. ఇజ్రాయిల్‌కు చెందిన రక్షణ వ్యవస్థ ఐరన్ డోమ్ తరహాలోనే సుదర్శన చక్ర తయారు చేస్తున్నట్లు చెప్పారు.

అన్ని రకాల వాతావరణాల్లో పనిచేసే రీతిలో సుదర్శన చక్ర ఉంటుందన్నారు. సమర్థవంతంగా మిస్సైళ్లను అడ్డుకుంటుందన్నారు. యుద్ధంపై సాంకేతికత ప్రభావం అన్న థీమ్‌పై సీడీఎస్ కీలక ఉపన్యాసం చేశారు. భవిష్యత్తులో జరగబోయే యుద్ధాలకు సరిహద్దులు ఉండవన్నారు. అన్ని డోమెయిన్ల మధ్య సంయుక్త స్పందన అవసరం అన్నారు. సంయుక్తంగా అన్ని రంగాల్లో శిక్షణ పొందాలన్నారు. ఆపరేషనల్ సామర్థ్యాన్ని పెంచుకోవాలంటే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్, క్వాంటమ్ విధానాలకు పెద్ద పీట వేయాల్సి వస్తుందన్నారు.

# మట్టి గణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం : ఎమ్మెల్యే కూనంనేని

ఖమ్మం, ఆగష్టు 26:మట్టి విగ్రహాలతో వినాయక చవితి పండుగ జరుపుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణ దిశగా అడుగులు వేద్దామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ పరిధిలోని పలు సెంటర్లలో ఏర్పాటు చేసిన మట్టి విగ్రహాల పంపిణి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలతోనే పండగ జరుపు కోవాలన్నారు. కాలుష్య నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 3 వేల మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

నియోజకవర్గ పరిధిలో గణేష్ మండపాల వద్ద పారిశుధ్య పనులు చేపట్టాలని, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరించాలని సూచించారు. పండుగను పురస్కరించుకుని నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, అధికారులు అహ్మద్, వీరభద్రా చారి, రంగ ప్రసాద్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు ఎస్కే ఫహీమ్, గెడ్డాడు నగేశ్, కేశవరావు, యూసుఫ్, బోయిన విజయ్ కుమార్, సత్యనారాయణాచారి, దుర్గ, సతీశ్ బాబు, నర్సింహా, అజీజ్, నీడల సుధాకర్ పాల్గొన్నారు.

# ఆగి ఉన్న ప్యాసింజర్ ఆటోను ఢీకొన్న బొగ్గు టిప్పర్.. ఆటో డ్రైవర్ మృతి

ఖమ్మం, ఆగష్టు 26:ఆగి ఉన్న ప్యాసింజర్ ఆటోను బొగ్గు లోడుతో వెళ్తున్న టిప్పర్ బలంగా ఢీకొన్న దుర్ఘటనలో ఆటో డ్రైవర్ మృతిచెందాడు. ఈ సంఘటన కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. సత్తుపల్లి నుంచి కొత్తగూడెం వైపు వస్తున్న బొగ్గు టిప్పర్ అంబేద్కర్ నగర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల అంబేద్కర్ నగర్ స్టేజి వద్ద ఆటో అద్దం తుడుచుకుంటూ ఉండగా వెనుక నుండి వచ్చి ఢీకొంది. దీంతో ఆటో డ్రైవర్ మంగళగిరి శేషగిరి (38) కి తీవ్రగాయాలు అవగా వైద్య చికిత్స కోసం కొత్తగూడెం సర్వజన ఆస్పత్రికి తరలించారు.

ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం మృతి చెందాడు. టిప్పర్ డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న కొత్తగూడెం టూ టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఇంతటి విషాదంలోనూ శేషగిరి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేసి మానవతను చాటారు.

# జంతువుల రక్త మార్పిడి, బ్లడ్ బ్యాంకుల కోసం తొలిసారిగా జాతీయ మార్గదర్శకాలు-ఎస్‌వోపీలు జారీ చేసిన భారత్

న్యూఢిల్లీ, ఆగష్టు 26:మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని పశుసంవర్ధక-పాడిపరిశ్రమల విభాగం (డీఏహెచ్‌డీ) "దేశంలో జంతువుల రక్త మార్పిడి, బ్లడ్ బ్యాంకుల కోసం తొలిసారిగా మార్గదర్శ కాలు-ప్రామాణిక కార్యాచరణ విధానాలు (ఎస్‌వోపీలు)" జారీ చేసింది. ప్రాణాలు రక్షించడంలో రక్త మార్పిడి ప్రాధాన్యం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. జంతువుల్లో గాయాలు, తీవ్రమైన రక్తహీనత, శస్త్రచికిత్స కారణంగా రక్తం పోవడం, అంటు వ్యాధులు, రక్తం గడ్డకట్టడంలో సమస్యలు ఉన్న సందర్భాల్లో రక్త మార్పిడి అవసరమవుతుంది. ఇప్పటివరకు దేశంలో పశువైద్యంలో రక్త మార్పిడి కోసం సమగ్ర జాతీయ విధానం ఏదీ లేదు. చాలా జంతువులకు అత్యవసరాల్లో రక్త మార్పిడి చేసేటప్పుడు ప్రామాణిక పద్ధతిలో దాతల స్క్రీనింగ్, రక్త వర్గాన్ని నిర్ణయించడం, రక్తాన్ని నిల్వ చేసే నిబంధనలను పట్టించుకునేవారు కాదు. జంతువుల్లో రక్త మార్పిడి కోసం దాతల ఎంపిక, రక్త సేకరణ, విభాగాల ప్రాసెసింగ్, నిల్వ, మార్పిడి పద్ధతులు, పర్యవేక్షణ, భద్రతాపరమైన జాగ్రత్తలను అనుసరించడంలోని అంతరాలను తగ్గించడానికి శాస్త్రీయ, నైతిక, నిర్మాణాత్మక విధానాలను ఈ మార్గదర్శకాలు-ఎస్‌వోపీలు అందిస్తాయి. వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, వెటర్నరీ విశ్వవిద్యాలయాలు, ఐసీఏఆర్ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రాక్టీస్ చేస్తున్న పశువైద్యులు, నిపుణులతో విస్తృత సంప్రదింపుల అనంతరం రూపొందించిన ఈ మార్గదర్శకాలు భారత్ అనుసరించే విధానాలను ప్రపంచ అత్యుత్తమ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చేస్తాయి.

భవిష్యత్తులో ఈ మార్గదర్శకాలు మొబైల్ రక్త సేకరణ యూనిట్లు, అరుదైన రక్త వర్గాల కోసం క్రయోప్రిజర్వేషన్, దాత-గ్రహీతలను సరిపోల్చే మొబైల్ అప్లికేషన్లు, అధునాతన రక్తమార్పిడి పరిశోధనల ద్వారా ఆవిష్కరణలను ప్రోత్సహిస్తాయి.

దేశంలోని పశువులు, పెంపుడు జంతువుల రంగాలు ప్రపంచంలోనే అతిపెద్దవి, వైవిధ్యమైనవి. వీటిలో 537 మిలియన్లకు పైగా పశువులు, 125 మిలియన్లకు పైగా పెంపుడు జంతువులు ఉన్నాయి. ఈ రంగాలు జాతీయ జీడీపీకి 5.5 శాతం, వ్యవసాయ జీడీపీకి 30 శాతానికి పైగా సహకారం అందిస్తున్నాయి. ఆహార భద్రత, గ్రామీణ జీవనోపాధి, ప్రజారోగ్యానికి మూలస్తంభంగా ఉన్నాయి. పశువుల్లో రోగ నిర్ధారణ, చికిత్సా విధానాల పురోగతితో ప్రత్యేక అత్యవసర పశుసంరక్షణ కోసం ప్రత్యేకించి వివిధ జాతుల జంతువుల్లో రక్త మార్పిడి సహాయం కోసం డిమాండ్ పెరుగుతోంది.

ఈ మార్గదర్శకాల జారీ భారత పశువైద్య ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో వైద్య సంరక్షణను బలోపేతం చేయడం.. జంతువుల ప్రాణాలను కాపాడడం.. గ్రామీణ జీవనోపాధిని పరిరక్షించడం, దేశవ్యాప్తంగా జంతు సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో గణనీయమైన విజయాన్ని సూచిస్తుంది. సూచనలుగా, చట్టబద్ధం కాని విధానాలుగా రూపొందించిన ఈ మార్గదర్శకాల పత్రం, జంతు సంక్షేమం, బయోసేఫ్టీ, ప్రజల విశ్వాసం పరంగా అత్యున్నత ప్రమాణాలను నిర్ధారిస్తూనే నూతన శాస్త్రీయ ఆధారాలు, క్షేత్రస్థాయి అనుభవాలు, సంబంధిత వ్యక్తుల అభిప్రాయాలతో క్రియాశీలంగా, నిరంతరం అభివృద్ధి చెందుతూ ఉంటుంది.

